సాక్షి
నారాయణపేట
గురువారం । 18 । మే । 2023



జోరుగా ఉల్లి వ్యాపారం

మార్కెట్‌కు నాణ్యమైన ఉల్లి రావడంతో వ్యాపారం జోరుగా సాగింది.

వివరాలు 8లో ▸



రైల్వేగేట్ మూసివేత

ఆర్‌ఓబీ పూర్తి కావడంతో రైల్వే గేట్ మూసి వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
41.0 /28.3

వాతావరణం

రోజంతా ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోత పెడుతుంది.

న్యూస్‌రీల్

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నారాయణపేట: భవన, ఇతర **నిర్మాణ సంక్షేమ** బోర్డు ద్వారా నేషనల్ అకాడమీ **ఆఫ్ కన్‌స్ట్రక్షన్** ఆధ్వర్యంలో ఇచ్చే వృత్తి నైపుణ్య శిక్షణను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కార్మిక శాఖ అధికారి రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని భవన, ఇతర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు వివిధ రకాల వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి కింద శిక్షణ పొందుటకు బోర్డింగ్ ద్వారా 290 వివిధ ట్రేడ్స్ మంజూరైనట్లు తెలిపారు. జిల్లా కార్మికశాఖ అధికారి ద్వారా గుర్తింపు పొంది ఉంటే ట్రేడ్స్ ద్వారా శిక్షణ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. మేస్త్రీ, పెయింటింగ్, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, బార్ బిల్డింగ్, స్టీల్ ఫిక్సింగ్ కింద 15రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.300 స్టైఫండ్, మధ్యాహ్న భోజనం అందిస్తారని, శిక్షణ పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో అర్హులైన భవన, ఇతర నిర్మాణరంగ కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్టేషన్‌లో మర్యాదగా వ్యవహరించాలి

నారాయణపేట రూరల్: పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదగా వ్యవహరించాలని వర్టికల్ అధికారి పర్వతాలు అన్నారు. బుధవారం జిల్లాలోని అన్ని పీఎస్‌లలో పనిచేస్తున్న రిసెప్షన్, వర్టికల్ సిబ్బందితో స్థానిక ఎస్పీ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఉండాల్సిన తీరు, వచ్చే ప్రతి వ్యక్తితో ప్రవర్తించే విధానం తెలియజేశారు. అవసరమైన సమాచారాన్ని తప్పకుండా తెలియజేయాలని సూచించారు. పోలీసు వ్యవస్థలో రిసెప్షన్ పని తీరు ఎంతో కీలకమైందని, పోలీసులపై ప్రజలకు నమ్మకాన్ని, గౌరవాన్ని కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఫిర్యాదులను వెంటనే ఎస్‌హెచ్‌ఓలకు తెలియజెప్పాలన్నారు.

కూలీల కోసమే చలివేంద్రం ఏర్పాటు



మాగనూర్: మండల కేంద్రంలోని నల్లగట్టు మారెమవ్వ సమీపంలో గల వలస కూలీల దాహం తీర్చేందుకు లేబర్ అధికారుల సూచనలతో ఆర్‌బీఎస్ బ్రిక్స్ యజమాని రామాంజనేయులు బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా జిల్లా లేబర్‌శాఖ అధికారి రాజ్‌కుమార్ విచ్చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఎండలతో వలస కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందుకోసమే బ్రిక్స్ యజమానితో మాట్లాడి చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమం ఆర్‌బీఎస్ బ్రిక్స్ యజమాని రామాంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం

నారాయణపేట రూరల్: వెనకబడిన కోటకొండపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ రాబోవు రోజుల్లో మండల సాధన ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సత్యయాదవ్ అన్నారు. మండలంలోని కోటకొండలో నిర్వహిస్తున్న రిలేదీక్షలు 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బుధవారం దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల కొడంగల్ నియోజకవర్గంలో కొత్తపల్లి, గుండుమాల్‌లను మండలాలుగా ప్రకటించి అన్నిఅర్హతలు ఉన్న కోటకొండను విస్మరించడం రాజకీయ దురుద్దేశమేనని విమర్శించారు. నాడు ఎన్‌టీఆర్ ప్రభుత్వంలోనే కోటకొండ మండలం అయ్యే అవకాశాలు ఉండగా, నాడు చైతన్యంలేక వెనకబడ్డారని, ప్రస్తుతం ఉద్యమాన్ని ఉధృతం చేసైన సాధించుకుంటామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు తాత్కాలికంగా భవనాలు ఉన్నాయని, కొత్త భవన నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలం ఉందని అన్నారు. విద్య, వైద్యం తదితర విషయాల్లో హైస్కూల్, పీహెచ్‌సీలు ఎన్నో సంవత్సరాలుగా నడుస్తున్నాయని చెప్పారు. చుట్టు పక్కల ఎన్నో గ్రామాలకు అందుబాటులో ఉందని, వెంటనే ఎమ్మెల్యే చొరవ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి కోటకొండను మండలంగా ప్రకటించేలా ఒత్తిడి తేవాలని అన్నారు. కార్యక్రమంలో కెంచె శ్రీనివాసులు, యాదగిరి, రాజు, ప్రవీణ్, హజిమలాంగ్, ప్రవీణ్, వెంకట్రాములు, సౌజన్య, బొరినదక గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఎండకు ఉక్కిరిబిక్కిరి..



జిల్లాకేంద్రంలో ఎండకు శీతల పానీయాలు తాగుతున్న జనం



జిల్లాలో 40 నుంచి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

- మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- వృద్ధులు, పిల్లలు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలని వైద్యుల సూచన

నారాయణపేట: జిల్లావ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 10 గంటల తర్వాత ఎండ తీవ్రత పెరుగుతుండటంతో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్నం వడగాలులు, ఉక్కపోతతో వాహనదారులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇళ్లనుంచి జనం బయటకి రావడం లేదు. ఉపాధి, వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులు ఇబ్బందిపడుతున్నారు. ఎండలతో అస్వస్థతకు గురవుతుండడంతో అత్యవసరమైతే తప్పా బయటికి రావద్దని వైద్యులు సూచిస్తున్నారు. వ్యాపారులు, ఇతర పనులకు వేళ్లే వారు శీతల పానియాలు, కొబ్బరి బోండాలు తాగుతూ ఉపశమనం పొందుతున్నారు.



ఎండలో పిల్లలకు కొంగు, టవల్ కప్పి తీసుకెళ్తున్న మహిళలు



జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇలా

తేదీ	గరిష్టం	కనిష్టం
12న	39.2	28.2
13న	41.3	29.1
14న	40.2	26.3
15న	40.4	29.3
16న	39.9	27.4
17న	40.2	28.4



తలకు టవల్‌తో బైక్‌పై వాహనదారులు

జాగ్రత్తలు పాటించాలి..



జిల్లాలో ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలో ఎండలో పశువులను బయటికి వదలరాదు. గేదెలకు చెమటగ్రంథులు ఉండవు. దాంతో అవి ఎండను తట్టుకోలేవు. ఉదయం 11 గంటల లోపు మేపి నీడపాటున కట్టేయాలి. ఆవులు, ఎద్దులైన మధ్యాహ్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లో ఎండలో వదలరాదు. పశువులకు సైతం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం తాగునీరు అందుబాటులో ఉంచాలి. పెంపుడు కుక్కలను ఇంట్లోనే ఉంచాలి. తాగునీరు అందుబాటులో ఉంచాలి. పక్షులు అడవిలో దాహంతో విలవిలలాడుతూ చనిపోయే పరిస్థితులు ఉంటాయి. గ్రామాల్లోకి వచ్చే పక్షులకు దాహం తీర్చేందుకు ఇళ్ల పైకప్పులు, కంపౌండ్ గోడలపైనా నీళ్ల అందుబాటులో ఉంచాలి.

– డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, నారాయణపేట

ఐదు లీటర్ల నీరు తాగాలి..



జిల్లాలో రోజురోజుకూ ఎండలు పెరుగుతున్నాయి. ఎండలో తిరిగే వారు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి. రోజుకు 5లీటర్ల నీటిని తాగడం మంచిది. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, చెరుకు రసం తీసుకోవాలి. మధ్యాహ్న సమయంలో అవసమైతే తప్పా బయటకు రావొద్దు. తప్పని పరిస్థితుల్లో వస్తే గంట.. రెండు గంటలకు ఒకసారి మంచినీరు తాగాలి. వాహనదారులు కాటన్ దుస్తులు ధరించాలి. హెల్మెట్ తప్పని సరివాడాలి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ రంజిత్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి

నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు



రెనివట్ల గ్రామంలో 'మన ఊరు-మన బడి' పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

- మద్దూరు మండలంలో పర్యటించిన కలెక్టర్
- ధాన్యం కొనుగోళ్లు, 'మన ఊరు-మన బడి' పనులు, ఆస్పత్రి పరిశీలన

మద్దూరు: అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష మండలంలోని మద్దూరు, పెదిరిపాడ్, రెనివట్ల, దోరేపల్లి, నిడ్జింత, భూనీడ్ గ్రామాల్లో మన ఊరు- మన బడి పనులను, వైద్యారోగ్యశాఖ సేవలు, ధాన్యం కొనుగోలు, తదితర సంక్షేమాభివృద్ధి పనులను పరిశీలించారు. రెనివట్ల జిలా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన ఊరు- మన బడి పనులు నత్తనడక జరగడంపై, అలాగే భూనీడ్‌లో పనులు ప్రారంభం కాకపోవడంపై ఆయా గ్రామాల సర్పంచ్‌లపై, అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పెదిరిపాడ్‌లో బుధవారం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఇమ్యూనైజేషన్, వ్యాక్సినేషన్, గర్భిణులకు అందించే సేవలు తదితర వాటిని అక్కడున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టినా ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం పనులు, పంచాయతీ నిర్మాణం పనులను పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సర్పంచ్‌లకు సూచించారు. పెదిరిపాడ్, మద్దూరు, రెనివట్ల, దోరేపల్లి గ్రామాల్లో పీఎస్‌ఎఫ్‌ఎస్‌ఈ కింద మంజూరైన కారంపొడి, పిండిమసాలా గిర్నీలను ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి, అక్కడున్న రైతులతో మాట్లాడారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం, రైతులు ఖాతాల్లో జమచేసిన డబ్బుల వివరాలను అక్కడున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి మద్దూరు సామాజికి ఆరోగ్య కేంద్రంలో ఓపీని పరిశీలించారు. అక్కడున్న డాక్టర్లు రోగులతో మాట్లాడారు. సీబీపీ, ఎన్‌సీడీ పరీక్షలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి మండలంలోని మల్లికార్జున, వీక్షిత రైస్ మిల్లులను తనిఖీ చేశారు. 2021–22 కు సంబంధించిన సీఎంఆర్ బకాలను పంపిణీ వేగవంతం చేయాలని రైస్ మిల్లుల యజమానులకు ఆదేశించారు.

అధికారులతో సమీక్ష..

మండలంలో పర్యటించిన పరిశీలించిన వాటిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. మన ఊరు- మన బడి పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జ్యోతి డీఎం హథిరామ్, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ చింతరవి పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ

నారాయణపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ అంగన్‌వాడీ టీచర్లు విధులు నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 68 అంగన్‌వాడీ కేంద్రాలు ఖాళీగా ఉన్నాయని, ఆ పోస్టుల భర్తీకి సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో బాలామృతం పంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. 16 వారాల పాటు బాలామృతం పెట్టాలని తెలిపారు. ఎనీమియా పరీక్షలు తరచూ నిర్వహించాలని చెప్పారు. గర్భిణులలో రక్తహీనత లేకుండా చూడాలన్నారు. వైద్యాధికారిని సందర్శించి రక్తహీనత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బరువు తక్కువ పిల్లలను ప్రత్యేకంగా గమనించి వారికి పౌష్టికాహారం అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ యాప్ చెక్ చేసుకోవాలని పోషణ ట్రాక్ చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు డ్రాప్ అవుట్ ఎంతమంది ఉంటే వారిని గుర్తించి కేంద్రాల రప్పించేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా శిశుసంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

మన్ననలు పొందేలా విధులు



మద్దూరు పోలీస్ స్టేషన్‌లో మొక్క నాటుతున్న డీఎస్‌పీ సత్యనారాయణ

మద్దూరు: ప్రజల మన్ననలు పొందేలా పోలీసులు విధులు నిర్వర్తించాలని నారాయణపేట డీఎస్‌పీ కె.సత్యనారాయణ సూచించారు. బుధవారం మద్దూరు పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీల్లో భాగంగా మద్దూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ పరేడ్, పరిసరాల పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులకు సంబంధించిన ఫైళ్లు, పెండింగ్ కేసు వివరాలను పరిశీలించారు. పోలీసులు సాంకేతికను అందింపుచ్చుకోవాలన్నారు. స్టేషన్ వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించి వారికి న్యాయం చేసే విధంగా చూడాలన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్



సీఎన్‌ఆర్ డీసీ పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్‌లు చూసి గదుల వివరాలు తెలుపుతున్న సిబ్బంది

- 94శాతం హాజరు నమోదు
- పరీక్ష రాసిన 980 మంది విద్యార్థులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో బుధవారం పాలిసెట్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 1,042 అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారికి పట్టణంలో సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్ఫూర్తి డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల మూడు పరీక్ష కేంద్రాలను కేటాయించారు. వాటిలో 980మంది పరీక్ష రాశారు. 62మంది గైర్హాజరయ్యారు. 94శాతం హాజరు నమోదైంది. నిమిషం నిబంధన ఉండటంతో గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షకు ముగ్గురు సీఎస్‌లు, మరో ముగ్గురు డిపార్ట్‌మెంట్ అధికారులతో పాటు 40మంది ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు. పాలిటెక్నిక్ కళాశాల నుంచి ప్రతీ కేంద్రంలో ప్రత్యేక పరిశీలకులుగా రమేష్‌కుమార్, పరమేశ్వరి, ఉమాశంకర్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రంగారెడ్డి, పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి పరీక్ష నిర్వహణను పరిశీలించారు.

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన పాలిసెట్ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 1,042 అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారికి పట్టణంలో సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్ఫూర్తి డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల మూడు పరీక్ష కేంద్రాలను కేటాయించారు. వాటిలో 980మంది హాజరయ్యారు. 162మంది గైర్హాజరయ్యారు. 94శాతం హాజరు నమోదైంది. నిమిషం ఆలస్యం నిబంధన ఉండటంతో గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. కోవిడ్ నిబంధనలు అమలు చేస్తూ వైద్య, ఆరోగ్య సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతించారు. పరీక్షకు ముగ్గురు సీఎస్‌లు, మరో ముగ్గురు డిపార్ట్‌మెంట్ అధికారులతో పాటు 40మంది ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు. పాలిటెక్నిక్ కళాశాల నుంచి ప్రతీ కేంద్రంలో ప్రత్యేక పరిశీలకులుగా రమేష్‌కుమార్, పరమేశ్వరి, ఉమాశంకర్‌ను ఏర్పాటుచేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రంగారెడ్డి, పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి పరీక్ష నిర్వహణను పరిశీలించారు.

కష్టాలు తెలుసుకుంటూ.. భరోసానిస్తూ...

- జిల్లాలో రెండోరోజు కొనసాగిన భట్టి పాదయాత్ర
- ఉపాధి, రైతు కూలీలతో మాటామంతి
- నవాబుపేట మండలంలో 11కి.మీ.ల మేర నడక



అమ్మాపూర్ శివారులో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క

జడ్చర్ల/నవాబుపేట: ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకుంటూ.. వారికి భరోసానిస్తూ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ముందుకు సాగింది. బుధవారం నవాబుపేట మండలం వెంకటేశ్వరతండా నుంచి ప్రారంభమైన పాదయాత్ర జంగమాయపల్లి, అమ్మాపూర్, దర్పల్లి, గురుకుంట మీదుగా నవాబుపేటకు చేరుకుంది. దారి పొడవునా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అమ్మాపూర్ శివారులో ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు వింటూనే గుణపం పట్టి మట్టిని తవ్వి కూలీల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా కూలీలు మణెమ్మ, యాదమ్మ, సత్యమ్మ తదితరులు తమ సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా నేడు కూలీలందరికి పని దొరుకుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు పథకానికి తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. కూలీలకు తాగునీరు, నీడ, సామగ్రి సమకూర్చాల్సి ఉందన్నారు. అదేవిధంగా మహిళా రైతు నాగమ్మ ఆరబోసిన వరి ధాన్యం దగ్గరకు చేరుకొని మాట్లాడారు. ధాన్యం ఆరబోసి 15 రోజులవుతున్నా కొనుగోలు చేయడం లేదని.. అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి నష్టపోయే ప్రమాదం ఉందని ఆమె వివరించారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమని.. ఇలాంటి కష్టాలు లేకుండా చేస్తామని భరోసా ఇచ్చారు. అమ్మాపూర్ దాటిన తర్వాత క్రికెట్ ఆడుతున్న యువకుల దగ్గరకు చేరుకొని బ్యాట్ చేతబట్టగా.. మాజీ ఎంపీ మల్లు రవి, టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి బౌలింగ్ చేసి ఉత్సాహపర్చారు. గురుకుంటలో అంబేడ్కర్, వైఎస్‌ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బహిరంగ చర్చకు సిద్ధం

పాలమూరు ఎత్తిపోతలపై తనకు అవగాహన లేదని బీఆర్‌ఎస్ మంత్రి, ఎమ్మెల్యేలు విమర్శించడంపై ఆయన స్పందించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరొచ్చిన సరే.. పాలమూరు ప్రాజెక్టుపై బహిరంగంగా చర్చించేందుకు సిద్ధమని ప్రకటించారు. ఒకరోజు పాదయాత్రను నిలిపివేసి.. మేధావుల సమక్షంలో సుదీర్ఘంగా చర్చిద్దామని సవాల్ విసిరారు. కాగా..గురువారం పీపుల్స్‌మార్చ్ యాత్రకు విరామం ప్రకటించారు. బుధవారం రాత్రి బస చేసిన రుక్కంపల్లి నుంచి తిరిగి శుక్రవారం యాత్ర ప్రారంభమవుతుందని టీపీసీసీ నేత అనిరుధ్‌రెడ్డి వెల్లడించారు.

అసైన్డ్ భూములు కొనుగోలు చేయొద్దు..

ప్రభుత్వ భూములు ఎవరూ కొనుగోలు చేయవద్దని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తీసుకొచ్చి స్వాధీనం చేసుకుంటామని టీపీసీసీ నేత మల్లు రవి అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇతరులకు కేటాయించిన ఆయా భూముల్లో ఎలాంటి పనులు చేపట్టొద్దని.. లాక్కొన్న భూములను తిరిగి పేదలకు కేటాయించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సొంతింటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామని తెలిపారు. నిరుద్యోగ భృతి అందజేస్తామన్నారు.

శైలజానాథ్ సంఘీభావం..

ఏపీ మాజీ పీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్ పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో పాల్గొని భట్టివిక్రమార్కకు సంఘీభావం ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రదీప్‌గౌడ్, బంగ్ల రవి, దుష్యంత్‌రెడ్డి తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు.

పనులు వేగంగా పూర్తి చేయండి



బస్టాండ్‌లో సీసీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

కోస్గి: మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ సూచించారు. బుధవారం పలు పనులను పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సీసీనిర్మాణ పనులు కంకర వేసి వదిలేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, త్వరగా పూర్తి చేయాలని, గ్రంథాలయ భవన నిర్మాణ పనులను, ప్రభుత్వాస్పత్రి నిర్మాణ పనులను, పంచతంత్ర పార్కు, డ్రెయినేజీ నిర్మాణం పనులను పరిశీలించారు. పట్టణ శివారులో సయ్యద్ పహాడ్ దర్గా సమీపంలో నూతన వెంచర్ స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ శశిధర్, కార్యాలయ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి


కృష్ణయ్య (ఫైల్)

కొత్తకోట రూరల్: బైక్ అదుపుతప్పి కిందపడడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పెద్దమందడి మండలంలోని మోజర్ల శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మోజర్లకు చెందిన నెల్లి కృష్ణయ్య(39) సొంత పని నిమిత్తం మండల కేంద్రానికి బైక్‌పై వెళ్లి, పని ముగించుకొని తిరిగి గ్రామానికి వెళ్తుండగా ప్రమాదశాత్తు బైక్ అదుపుతప్పి మోజర్ల సమీపంలో రోడ్డు పక్కన గల ముళ్లపొదలోకి దూసుకెళ్లింది. దీంతో నెల్లి కృష్ణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ..

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రాకొండలో బొడ్రాయి ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. లింగాల మండలం వల్లభాపురం చెందిన లక్ష్మయ్య దంపతులు రాకొండకు బొడ్రాయి పండుగకు వచ్చి మంగళవారం రాత్రి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం పాఠకులకు విధితమే. వల్లభాపురం చెందిన లక్ష్మయ్య బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా భరత్ బైక్ ఢీకొనడంతో లక్ష్మయ్యకు తీవ్రగాయాలు కాగా భరత్‌కు కూడా గాయాలు అయినట్లు ఎస్ఐ తెలిపారు. రాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మయ్య మృతిచెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి భార్య కాశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి బలవన్మరణం


హనుమంతు(23)

మదనాపురం: మనస్తాపం చెంది ఉరేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన బుధవారం మండలంలోని దుప్పల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన హనుమంతు (23) వ్యక్తిగత విషయంలో మనస్తాపం చెందిన ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం రాత్రి ఉరి వేసుకున్నాడు. కుటుంబసభ్యులు వచ్చి బుధవారం ఉదయం ఇంటి తలుపులు తెరవాలని బయట నుంచి పిలిచినా పలకలేదు. చుట్టు పక్కల వారి సాయంతో తలుపులు తీశారు. అప్పటికే చీరతో ఉరి వేసుకుని చనిపోయాడని ఎస్ఐ తెలిపారు. తల్లి లక్ష్మీదేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

వృద్ధుడి ఆత్మహత్య

వనపర్తి: ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం జిల్లా కేంద్రంలో వెలుగుచూసింది. ఎస్ఐ రాము తెలిపిన వివరాల మేరకు.. మహిళా డిగ్రీ కళాశాల సమీపంలో నివాసం ఉండే రమేష్ (70) కొంత కాలంగా అనారోగ్య, ఆర్థిక సమస్యలతో ఇబ్బందిపడుతూ ఉండేవాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. తన భర్త ఎంతకీ ఫోన్ ఎత్తకపోవడంతో భార్య పద్మావతి పక్కింటి వారికి ఫోన్ చేసి ఇంట్లో ఉన్నాడేమో చూడాలని కోరింది. తలుపులు మూసి ఉండటంతో కిటికీలో నుంచి చూస్తే ఉరేసుకున్నట్లు గుర్తించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భర్త ఇంటి ఎదుట భార్య నిరసన

అచ్చంపేట రూరల్: ప్రేమించి పెళ్లి చేసుకుని, తీరా మోజు తీరాక వదిలించుకున్న భర్త ఇంటి ఎదుట భార్య న్యాయం కావాలని నిరసన చేపట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన బిందు, అచ్చంపేట పట్టణానికి చెందిన అశోక్ ఇద్దరు ప్రేమించుకున్నారు. 2019లో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ఆలయంలో పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం ఈమె నాలుగు నెలల గర్భవతి. కాగా భర్త ఆమెను వదిలేయడంతో ఈనెల 4న పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. ఈనెల 14న ఇంటికి తీసుకెళ్తానని చెప్పిన భర్త ముఖం చాటేయడంతో బుధవారం ఇంటి ముందు కూర్చుని భార్య నిరసన వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయాలని బాధితురాలు కోరింది. ఈ మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలు తెలిపింది.

10మంది బైండోవర్

మహమ్మదాబాద్: మండలంలోని షేక్‌పల్లి చెరువు చేపల పంచాయితీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న విషయం విధితమే. బుధవారం ఎస్ఐ సైదయ్య, తహసీల్దార్ ఆంజనేయులు కలిసి గ్రామంలోని రెండు వర్గాలతో మాట్లాడారు. చెరువులోని చేపలను పట్టుకునే హక్కు పూర్తిగా మత్స్యకారులకే ఉందని, సంబంధిత పత్రాలు కూడా ఉన్నాయని తెలిపారు. చెరువు దగ్గరికి చేపల విషయమై మరో వర్గం వారు వెళ్లకూడదని తెలిపారు. అంతకు ముందుగా కూడా రెండు వర్గాలు మళ్లీ ఘర్షణకు దిగితే రూ.5లక్షల వరకు జరిమానా చెల్లించాలని గ్రామస్తులు, అధికారుల ఎదుట తీర్మానం చేసుకున్నారు. ఈ కేసు విషయంలో పది మందిని బైండోవర్ చేశారు. గ్రామంలో రెండు వర్గాల మధ్య ఎలాంటి గొడవలు చోటు చేసుకున్నా 10 మంది బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.

జోరందుకున్న ఉల్లి వ్యాపారం

- మార్కెట్‌లో వినియోగదారుల సందడి

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి వ్యాపారం జోరందుకుంది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వినియోగదారులతో మార్కెట్‌లో సందడి కనిపించింది. ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న ఉల్లి బాగా ఆరడంతో పాటు నాణ్యంగా ఉండడం వల్ల వినియోగదారులు పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేయడానికి వచ్చారు. ఏడాది పొడువున నిల్వ చేసుకోడానికి అవకాశం ఉండడంతో పలువురు ముందస్తుగా కొనుగోళ్లు చేశారు. ఫిబ్రవరి నుంచి ఉల్లి సీజన్ ప్రారంభమైంది. నాలుగు నెలలుగా సీజన్ కొనసాగుతున్నప్పటికీ ఉగాది తర్వాత ఎండలు పెరిగినా నాణ్యమైన ఉల్లి అమ్మకానికి రావడం ప్రారంభమైంది. ప్రస్తుతం ఉల్లి సీజన్ చివరి దశకు చేరిన సమయంలో బాగా అరబెట్టి ఉల్లి మార్కెట్‌కు అమ్మకానికి వచ్చింది. ఇక ధరలు కూడా తక్కువగా ఉండడం వల్ల వినియోగదారులు ఉల్లి బస్తాలను కొనుగోలు చేశారు.

క్వింటాల్ ఉల్లి ధర రూ.1,200

మార్కెట్ యార్డులో నిర్వహించిన వేలంలో ఉల్లి ధర గరిష్ఠంగా రూ.1,200 వరకు పలికింది. కనిష్ఠంగా రూ.600 వరకు ధర వచ్చింది. చిన్నపేడు ఉల్లి క్వింటాల్ ధర రూ.300 వరకు పలికింది. మార్కెట్‌లో 45 కేజీల ఉల్లి బస్తా గరిష్ఠంగా రూ.600, కనిష్ఠంగా రూ.300 వరకు విక్రయించారు. చిన్నపేడు ఉల్లి బస్తా ధర రూ.150 వరకు అమ్మకాలు చేశారు. బయట నుంచి వచ్చిన వ్యాపారులు, చిరు వ్యాపారులు వేలంలో కొనుగోలు చేసిన ఉల్లిని వాహనాలలో తరలించారు.


దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లి తూకాలు వేస్తున్న కూలీలు

మార్కెట్ బయట పోటీ వ్యాపారం

మార్కెట్ బయట పోటీ వ్యాపారం కొనసాగింది. రైతులు నేరుగా ఉల్లి బస్తాలను తెచ్చి విక్రయించారు. కొందరు రైతులు ట్రాక్టర్లపై ఉల్లి బస్తాలను తెచ్చి మార్కెట్ బయట విక్రయించారు. 50 కేజీల ఉల్లి బస్తా ధర రూ. 600 నుంచి రూ. 500 వరకు విక్రయించారు. చిన్నగా ఉన్న ఉల్లిని రూ.400 నుంచి రూ. 300 బస్తాగా అమ్మకాలు చేశారు.

జోగుళాంబ సన్నిధిలో ఆర్‌డీడీ


ఆర్‌డీడీకి స్వాగతం పలుకుతున్న ఆలయ ముఖ్య అర్చకులు


రుద్రహోమాలు చేస్తున్న భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను బుధవారం మల్టీజోన్-2 వరంగల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఫర్ ఆడిటింగ్ రాము కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు వారు గణపతి పూజలు, బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.

ఆలయంలో రుద్రహోమం

మాస శివరాత్రిని పురస్కరించుకుని బాలబ్రహ్మేశ్వరుడి యాగశాల మండపంలో రుద్రహోమాలను నిర్వహించారు. అర్చకులు దేవళ్ల కృష్ణమూర్తి శర్మ హోమలను శాస్త్రీయంగా నిర్వహించారు. ప్రతి మాస శివరాత్రి రోజున ఈ రుద్రహోమాలు ఉంటాయని ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు.

బందోబస్తుకి వచ్చి అదృశ్యమైన హోంగార్డు


వెంకటయ్య

మన్ననూర్: మంత్రి పర్యటనలో భాగంగా బందోబస్తుకు వచ్చిన హోంగార్డు అదృశ్యమవడంపై కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అమ్రాబాద్ సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల వివరాల ప్రకారం.. అమ్రాబాద్ మండలం బీకే తిర్మలాపూర్ చెందిన వెంకటేష్ ఈగలపెంట పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. మంత్రి సత్యవతి రాథోడ్ పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి అటవీశాఖ చెక్‌పోస్టు, హరిత హోటల్ సమీపంలో మరో ముగ్గురు (పోలీసులు, హోం గార్డులు) బందోబస్తులో ఉన్నారు. తోటి ఉద్యోగులతో పాటు విధులు ముగించుకుని (మంగళవారం ఉదయం 8:30 గంటలకు) పోలీస్ స్టేషన్‌కు తిరిగి వచ్చే క్రమంలో నేను వస్తాను మీరు పదండి అని తోటి వారికి చెప్పాడు. రాత్రి 11 గంటలు అయినా ఇంటికి రాకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుధవారం ఉదయం హోటల్‌కు సంబంధించిన సీసీ ఫుటేజీను పరిశీలించగా చెరువు సమీపంలోకి వెళ్లినట్లు కనిపించింది. దీంతో దుర్వాసుల చెరువు ఒడ్డుపైన గమనించగా బూట్ల జాడలు ఉన్నాయి. దీంతో అమ్రాబాద్, ఈగలపెంట పోలీసులు, ఫైర్ సర్వీస్ సిబ్బంది, గ్రామస్తులు సాయింత్రం 6 గంటల వరకు చెరువులో గాలించినప్పటికీ ఫలితం లభించలేదు. దీంతో ఈగలపెంట నుంచి గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపడుతున్నారు.


దురువాసుల చెరువులో గాలింపు చర్యలు చేపడుతున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు

భార్య మృతికి కారణమైన భర్తకు జీవితఖైదు

మక్తల్: భార్య మృతికి కారణమైన భర్తకు జీవిత ఖైదు విధించినట్లు బుధవారం ఎస్ఐ పర్వతాలు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరుకు చెందిన రాజేశ్వరి(24)కి 2003లో మక్తల్‌కు చెందిన చంద్రశేఖర్‌గౌడ్‌తో వివాహమైంది. కొద్ది రోజుల తర్వాత భర్త అదనపు కట్నం కోసం వేధించడంతో తప్పనిసరి పరిస్థితులలో కొంత నగదు ఇచ్చారు. తిరిగి ఇంకా కావాలని వేధించడంతో ఫిబ్రవరి16, 2005లో రాజేశ్వరి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మృతురాలి తండ్రి పండిత్‌రాజ్‌గౌడ్ అప్పట్లో మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ శ్రీనివాస్‌రావు కేసు నమోదు చేయగా సీఐ సుబ్బరాయుడు కేసు పరిశీలించి కోర్టుకు చార్జిషీట్ సమర్పించారు. అడిషనల్ పీపీ మురళీకృష్ణ 12 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం నిరూపణ కావడంతో చంద్రశేఖర్‌గౌడ్‌కు జీవితఖైదుతో పాటు, రూ.15వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి తీర్పును ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

దేవరకద్రలో రైల్వేగేట్ మూసివేత

దేవరకద్ర రూరల్: పట్టణంలోని ఆర్‌ఓబీ పూర్తయిన నేపథ్యంలో రైల్వే నిబంధనల ప్రకారం గతంలో రాకపోకలను కొనసాగించిన రైల్వే గేట్‌ను బుధవారం నుంచి మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను రెవెన్యూ, పోలిస్ శాఖలతో పాటు ఆర్టీసీ అధికారులకు పంపించారు. నియోజకవర్గ కేంద్రంలోని ఎల్‌సీ నెంబర్ 73వ గేట్‌ను శాశ్వతంగా మూసివేస్తున్నట్లు అందులో పొందుపరిచ్చారు. అధికారుల ఆదేశాల మేరకు స్థానిక సిబ్బంది బుధవారం మధ్యాహ్నం గేట్‌ను మూసివేశారు. కాగా బుధవారం పట్టణంలో సంత రోజు కావడంతో పాటు ఉత్తర్వులు అదే రోజు రాగా, స్థానిక ప్రజల కోరిక మేరకు మళ్లీ తెరిచి రాకపోకలకు అనుమతించారు. రాత్రి నుంచి గేట్‌ను పూర్తిగా మూసివేస్తామని సిబ్బంది తెలిపారు.

రైల్వే అధికారులకు ఎంపీ వినతి

గేట్‌ను శాశ్వతంగా మూసివేస్తామని అధికారులు ప్రకటించారు. పట్టణంలో పలు వ్యాపార వాణిజ్య భవన సమూదాయలతో పాటు ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయలు, పాఠశాలలు గేట్‌కు ఇరువైపులా విస్తరించి ఉన్నాయి. ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా కేవలం ఆర్‌ఓబీ పైన రాకపోకలకు అనుమతి ఇస్తే తీవ్ర ఇబ్బందులు కలగడంతో పాటు వ్యాపార, పట్టణ అభివృద్ధి పరంగా కోలుకోలేని ఇబ్బందులు ఎదురవుతాయని స్థానిక నాయకులు, యువకులు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి విన్నవించారు. స్పందించిన ఆయన స్థానికంగా కలిగే ఇబ్బందులను అధికారులకు వివరిస్తూ గేట్ మూసివేతను నిలిపివేయాలని కోరుతూ దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్‌కు లేఖ పంపించారు.

నేడు పట్టణ బంద్

ప్రజల అభిప్రాయం తెలుసుకోకుండా, ఏకపక్షంగా రైల్వేగేట్‌ను శాశ్వతంగా మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో స్థానికంగా ఉన్న ప్రజలు, వ్యాపారస్తులు అందరూ కలిసి గురువారం పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. అందరూ స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని కోరారు.


దేవరకద్రలో మూసివేసిన రైల్వే గేట్

స్వచ్ఛ సర్వేక్షన్ అభియాన్ భేష్

- రాష్ట్ర చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఉమారాణి

బాలానగర్: మండలంలోని పెద్దాయపల్లి, చెన్నంగులగడ్డ తండాలలో రాష్ట్ర చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఉమారాణి బుధవారం పర్యటించారు. గ్రామాల్లోని సమస్యలపై ఆరా తీసిన ఆమె చెన్నంగులగడ్డ తండాలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ లైన్ పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షన్ అభియాన్ భేష్ అని, హరితహారం, నర్సరీ పెంపు సంతృప్తికరంగా ఉన్నట్లు పేర్కొన్నారని ఎంపీడీఓ కృష్ణారావు తెలిపారు. ఆమె వెంట డీఆర్‌డీఓ యాదయ్య, డీపీఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు శంకరప్ప, రవి నాయక్ ఉన్నారు.

విశాఖపట్నం నుంచి మహబూబ్‌నగర్‌కు రైలు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రతి రోజు నడిచే విశాఖపట్నం-కాచిగూడ-విశాఖపట్నం (12861/12862) ఎక్స్‌ప్రెస్ రైలును మహబూబ్‌నగర్ వరకు పొడగించినట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. రైలు 19న విశాఖపట్నంలో సాయంత్రం 6:40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9:20 గంటలకు మహబూబ్‌నగర్‌కు చేరుకుంటుంది. తిరిగి అదే రోజు మహబూబ్‌నగర్ నుంచి సాయంత్రం 4:10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6:50 గంటలకు విశాఖపట్నంకు చేరుకుంటుందని పేర్కొన్నారు.

కేంద్రీయ విద్యాలయలో ఇంటర్ ప్రవేశాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దశరథరామ్ బుధవారం తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ కోర్సులలో మొత్తం 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్, నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. సీబీఎస్‌ఈతో పాటు స్టేట్ సిలబస్ చదివిన విద్యార్థులకు కూడా అవకాశం ఉందన్నారు. జేఈఈ, నీట్ వంటి పరీక్షపై ప్రత్యేక దృష్టి సారించి, 30 ఏళ్ల అనుభవం గల అధ్యాపకులు కళాశాలలో ఉన్నట్లు పేర్కొన్నారు.



ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

అయిజ: రైతులు పండించిన ధాన్యంను మద్దతు ధరకు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ మున్సిపాలిటీతో పాటు నౌరోజ్ క్యాంపు, చిన్న తాండ్రపాడు, వేణిసోంపురం, కేశవరం గ్రామాల్లో బహుజన రాజ్యాధికార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాల కోసం రైతులు కల్లాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు వ్యతిరేక విధానాలతో దేశానికి అన్నం పెట్టే రైతన్నను క్షోభకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. అకాల వర్షాలకు పంటనష్టం అంచనా వేయడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కేశవరావు, నాయకులు రవిచంద్ర, మధు గౌడ్, బల్గూరి సురేష్, స్వామిదాస్, చిన్న, హనుమన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో మరింత తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి కేవలం 768 క్యూసెక్కుల నీరు వచ్చింది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, 6.658 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 143 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

శ్రీశైలంలో 809.5 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం 809.5 అడుగుల నీటి మట్టం, 34టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24గంటల వ్యవధిలో ఎంజీకేఎల్ఐకు నీటి విడుదల కాలేదు. ఎండ తీవ్రత వలన జలాశయంలో 241 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం 1,020 అడుగుల వరకు నీటిమట్టం వచ్చి చేరింది. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

అస్తమించిన పాలమూరు సూరీడు

- అనారోగ్యంతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈర్ల నర్సింహ మృతి
- 50 ఏళ్లుగా పేదల కోసం పోరాటం


ఈర్ల నర్సింహ

బిజినేపల్లి/నాగర్‌కర్నూల్ రూరల్: ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో ప్రజా సమస్యలపైన సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేసి పేదల ప్రజల్లో వెలుగులు నింపిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈర్ల నర్సింహ అనారోగ్యంతో బుధవారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. 2019లో తలకు గాయం కావడంతో నాలుగేళ్లుగా మంచానికే పరిమితమై, కొద్ది రోజులుగా అనారోగ్య మరింత క్షీణించింది. ఆయన మరణ వార్త విన్న ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు సంతాపం తెలిపారు. గురువారం సాయంత్రం వెల్గొండలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగం వీడి ప్రజాపోరాటం

నిరుపేద కుటుంబంలో జూన్ 25, 1951లో జన్మించిన ఈర్ల నర్సింహ్మ బీఎస్సీ మ్యాథ్స్ పూర్తి చేసి 1970లో సింగరేణిలో ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, మరికొన్ని ప్రభుత్వ ఉద్యోగాలను వీడి ప్రజలకు సేవ చేయాలని సంకల్పించారు. అప్పట్లో సీపీఐ ఆధ్వర్యంలో పలు ప్రజా పోరాటాల్లో ముందున్న ఈయన, 1980 నుంచి 2018 వరకు సర్పంచ్, ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ పదవులను చేపట్టినా, ప్రజా పోరాటంలో ముందుండి పోరాడారు. ఉమ్మడి జిల్లాలో ఎన్నో పరిశ్రమల స్థాపనకు కారణమయ్యారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం నిరాశ్రయులైన పేదలకు ఇళ్లు, సరైన నష్ట పరిహారం, అదేవిధంగా ఉద్యోగాల కల్పన కోసం ఎంతో కృషి చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే కార్మికుల సంక్షేమం కోసం పోరాటాలు చేసి వాటిని సాధించారు. గ్రామాల్లో తాగునీరు, నిత్యావసర ధరల పెరుగుదల, పేదల ఇళ్ల స్థలాలు వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో ఆయా ప్రభుత్వాలతో సు. దీర్ఘకాలం పాటు పోరాడిన వ్యక్తిగా పాలమూరు చరిత్రలో నిలిచారు. నిత్య ప్రజా సమస్యలపై తన గొంతును వినిపిస్తూ వార్తల్లో నిలిచారు. 2009 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కూటమిలో పని చేయడమే కాకుండా రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల సమస్యలపై తనదైన శైలిలో పోరాటం చేసి తనదైన ముద్ర వేసుకున్నారు. 2000 సంవత్సరం నాటికే వెల్గొండ గ్రామంలో విశాల సీసీ రహదారులు, వీధి దీపాలు, తాగునీటి కుళాయిలు, పాఠశాలలు, మురుగు కాల్వలు, చెరువులు, కుంటలను ఏర్పాటు చేసి వాటి మరమ్మతు చేసి గ్రామాన్ని సస్యశ్యామలం చేశారు.

విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కుచుకూళ్ల దామోదర్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వత్‌రెడ్డి, సీపీఐ నాయకులు బాల నర్సింహ, కృష్ణాజీ తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

మనిషి ముఖం ఆకారంలో వింత పురుగు


మానవుని తలను పోలి ఉన్న పురుగు

గద్వాల రూరల్: మండలంలోని చెనుగోనిపల్లిలో బుధవారం మానవాకారంలో ఉన్న వింత పురుగు కనిపించింది. గ్రామంలోని హలీంపాష ఇంట్లోని చెట్టుపై కనిపించగా, పురుగుకు తల, ముక్కు, కళ్లు, చెవులు ఉండడంతో అచ్చం మనిషి తల ఆకారంలో కనిపించడంతో గ్రామస్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. వింతపురుగును చూడడానికి చుట్టు పక్కల వారు తరలివచ్చారు. ఈ పురుగు విషయంపై కేవీకే పాలెం వ్యవసాయ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్త ప్రొఫెసర్ శైలను సంప్రదించగా.. ఈ పురుగు 'మైనర్ ఫెస్ట్ స్టింక్ బగ్' జాతికి చెందినదని, ఇది మానవుని తలను పోలి ఉండడంతో దీనికి 'మ్యాన్ ఫెస్ స్టింక్ బగ్' అని నామకరణం చేసినట్లు తెలిపారు. ఇది రసం పీల్చే పురుగు అని చెట్లపై, ఆకులపై నివాసంగా చేసుకుని జీవిస్తుందన్నారు. ఇది దుర్వాసనను వెదజల్లుతుందన్నారు. అదేవిధంగా ఇదేమి మనుషులకు, వ్యవసాయ పంటలకు హాని చేసే రకం కాదన్నారు. ఈ పురుగు గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

పునరావాసం పనులు పూర్తవ్వాలి


పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

- అధికారులకు కలెక్టర్ రవినాయక్ ఆదేశం

జడ్చర్ల: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏర్పాటు చేయనున్న ఉదండాపూర్ రిజార్వయర్‌లో ముంపునకు గురవుతున్న ఉదండాపూర్, వల్లూరు, ఇతర తండాల పునరావాసం పనులను పూర్తి చేయాలని కలెక్టర్ రవినాయక్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని దేవునిగుట్టతండా, పోలేపల్లి శివార్లలో కొనసాగుతున్న ఆర్అండ్ఆర్ పనులను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలన్నారు. రోడ్లు, డ్రైయినేజీలతో పాటు తాగునీరు, విద్యుత్ సరఫరాతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వైకుంఠధామం ఇతర పనులను పూర్తి చేయాలన్నారు. ఆయా పనులకు గతంలో టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులలో ఆలస్యం చోటు చేసుకుందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. తక్షణమే వారందరితో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన స్తంభాలు, విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, టీఎస్ఎంఐడీసీ ఇతర శాఖల ద్వారా చేపట్టాల్సిన పనులను సమీక్షించాలన్నారు. అవసరమైన మెటీరియల్‌ను ముందస్తుగానే నిల్వ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారాం, ఆర్డీఓ అనిల్‌కుమార్, పంచాయత్‌రాజ్ ఎస్ఈ వెంకటరమణ ఇతర అధికారులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

అతి సులభంగా రుణాలు పొందండి. వ్యాపారం ప్రాపర్టీ మార్ట్ గేజ్ వ్యక్తిగత LIC వ్యవసాయ భూమిపై తక్కువ దస్తావేజులతో పొందండి. 9505973750, 8096532189.

OLD AGE HOME

మీన్స్ వృద్ధుల సేవా సంస్థ నందు వృద్ధులకు, బెడ్ పేషెంట్స్‌కు, దీర్ఘవ్యాధులలో ఉన్నా వారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24 గం॥ వైద్య, భోజనం, వసతి. ECIL, Hyd. సంప్ర: 9949520296/7981467086/6281127224.

WANTED

హైదరాబాద్‌లో 5 స్టార్ హోటల్స్‌లో పనిచేయుటకు క్యాటరింగ్ బాయ్స్, గర్ల్స్, హెల్పర్స్, సెంగార్డ్స్, హౌస్ కీపర్స్ కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీ: 15,000/- to 30,000/-. Ph: 7981515640, 9989930582

నేత్ర హోమ్‌కేర్ సర్వీసెస్: Hydలో పెద్ద వారికి, వృద్ధులకు సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీ/పు॥ కావలెను. జీతం: 15000 to 25000. రూం+ భోజనం ఫ్రీ ✆ 9676917002, 9908912806

Looking For Sales Officer with 2 Years Experience In Agro Chemical Marketing In Telangana State. 12Posts To be Filled Email : hr@hifield-ag.com Please Call : 7770008039 / 8380012271

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. : 200/- (Black & White)
అదనపు లైనుకు రూ. : 50
5% GST అదనం మాత్రమే
వివరాలకు :
మహబూబ్‌నగర్ : 9010234478, 9010522215, 9705135557, 9010869797
జడ్చర్ల : 9010076222
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి : 9010068317
గద్వాల : 9553955603
నారాయణపేట : 9010962007

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు ఎవరో క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్